KYA PURDAH TARAQQUI KI RAH MEIN
RUKAWAT HAI?
(Telugu)

# పరదా
# ప్రగతికి ప్రతిబంధకమా?


మూలం:
పర్వీన్ రజ్వీ

అనువాదం:
ముహమ్మద్ ఇక్బాల్ అహ్మద్

# మా మాట

విజ్ఞానం వెర్రితలలు వేస్తున్న ఈ యుగంలో పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడి, కోరికలకు బానిసలై మృగప్రాయంగా సంచరించే ఆధునిక యువతరానికి కనువిప్పు ఈ వ్యాసం. సమాన హక్కులంటూ స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించి అహర్నిశలు ప్రచారం చేసే వారికీ, "ఇస్లామ్"ను, "పరదా"ను ఎగతాళి చేస్తూ ఊకదంపుడు ఉపన్యాసాలు దంచే ఆధునిక "సంస్కర్తల"కు గుణపాఠం. ఈనాటి సెక్సు నేరాలు, సెక్సు రోగాలు, "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అనే దానికి మేము పూర్తిగా వ్యతిరేకులం. స్త్రీకి ఇవ్వవలసిన స్థానాన్ని గుర్తించి సమాజంలో స్త్రీ యొక్క అసలు స్థానాన్ని తెలియజెప్పడం మా ఉద్దేశ్యం.

ఆ ఉద్దేశ్యంతోనే ఈ చిరుపుస్తకాన్ని అందజేస్తున్నాము. ఇది సమస్యను పూర్తిగా, సవివరంగా పరిశీలించకపోయినా ఈ విషయంలో ముఖ్య చర్చనీయాంశాలను మట్టుకు స్పర్శిస్తుంది.

ఈ వ్యాసం 1955, మార్చి 2న నష్తర్ మెడికల్ కాలేజి, ముల్తాన్ (పాకిస్తాన్)లో ఏర్పాటయిన ఓ చర్చాగోష్టిలో చెయ్యబడిన ప్రసంగం యొక్క పూర్తి పాఠం. ఉపన్యాసకురాలికి తెర (పరదా) వెనుక నుండి ప్రసంగించే అనుమతి ఇవ్వకపోతే ఆమె ఓ దుప్పటి కప్పుకుని ప్రసంగించారు. ఆ పోటీలో ఆమెకే ప్రథమ బహుమతి దొరకడమేకాక పరదా వ్యవస్థకు అనుకూలంగానే అత్యధిక సంఖ్యలో శ్రోతలు ఓటు చేశారు!

ప్రసంగం పాకిస్తాన్‌లో చెయ్యబడినా ఇందులో చర్చించబడిన విషయం విశ్వజనీనమయింది. కాబట్టి ఈ వ్యాసాన్ని ఇప్పుడు పుస్తక రూపంలో తెలుగు పాఠకులకు అందిస్తున్నాము.

- ప్రకాశకులు

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# పరదా ప్రగతికి ప్రతిబంధకమా?

పరదా ప్రగతికి ప్రతిబంధకమా? కాదా? అనే ప్రశ్నకు జవాబు చేప్పే ముందు, పరదా అంటే ఏమిటో మనం తెలుసుకోవాలి. అది తెలుసుకోకుండా పరదా ఉద్దేశ్యం, దానివల్ల కలిగే లాభాలు, నష్టాలు ఏమిటో అర్థం చేసుకోలేం. ఆ తర్వాత మనం సాధించదలచిన ఆ ప్రగతి ఎటువంటిదో కూడ మనం నిర్ణయించవలసి ఉంటుంది. ఈ నిర్ణయం తీసుకోకుండా ప్రగతికి పరదా అడ్డుపడిందా? లేదా? అనేది ఎలా తెలుసుకోగలం?

"పరదా" అనే ఉర్దూ పదం, అరబ్బీ భాషలో హిజాబ్ అనే మాటకు సరయిన అనువాదం, అరబీలో హిజాబ్ అన్న దానిని - ఫార్సీ ఉర్దూ భాష లలో పరదా అంటారు. మనం తెలుగులో దాన్ని యధాతథంగా ఉపయోగిస్తుంటాం. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇంటికి అందరూ మొహమాటం లేకుండా రాకపోకలు సాగించడాన్ని వారించడానికి, "ఇంట్లోని ఆడవారి వద్ద నుండి ఏదయినా వస్తువు తీసుకోవాలంటే చాటున నిలబడి అడగాలి" అని ఆజ్ఞాపించాడు అల్లాహ్. హిజాబ్ అనే పదం దివ్యఖుర్ఆన్‌లో పై ఆదేశమున్న వాక్యంలోనే ఉంది. "పరదా" వ్యవస్థ ఈ ఆదేశంతోనే ప్రారంభం అయింది. ఆ తర్వాత ఈ సందర్భంగా వచ్చిన ఆజ్ఞలన్నింటినీ "పరదా నియమాలు" అని అంటారు.

పరదా నియమాలు ఖుర్‌ఆన్ 24, 33 వ సూరాలలో విపులంగా ఉన్నాయి. అందులో, స్త్రీలకు వారు తమ ఇండ్లలో హుందాగా ఉండాలనీ, అజ్ఞానకాలపు స్త్రీల వలె అలంకరణలు ప్రదర్శిస్తూ తిరక్కూడదని, ఇంట్లో నుంచి బయటకు వెళ్ళాలంటే పైన దుప్పటి కప్పుకుని బయల్దేరాలని, మ్రోగే నగలు ధరించి బయట తిరక్కూడదని, ఇంట్లో కూడా అందరు పురుషుల ఎదుటికి రాకూడదని, ధర్మం ప్రకారం ఎదుటపడగల పురుషులు (అన్న, తమ్ముడు, బాబాయి, మామయ్య వగైరా) నౌకర్లు, కలిసిమెలిసి తిరిగే స్త్రీల సమక్షంలో తప్ప మిగతా వారెదుట అలంకరణలతో తిరుగరాదని ఉంది. (అంటే అందమైన దుస్తులు, నగలు, మేకప్ ఇందులో చేరి ఉన్నాయి). ఇంకా ఎదుట పడగల పురుషుల విషయంలో కూడా స్త్రీలకు నిబంధనలున్నాయి. వక్షస్థలంపై పైటచెంగు వేసుకొని ఉండాలి. ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప మిగతా శరీరమంతా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. మగవారు, తల్లి, అక్కచెల్లెంద్రతో కలిసి మాట్లాడాలనుకున్నా వాళ్ళ గదిలోకి అనుమతి తీసుకుని మరీ వెళ్ళాలి, ఎందుకంటే వారు బట్టలు మార్చుకుంటూ ఉండవచ్చు, మరే పనిలోనైనా నిమగ్నులై ఉండవచ్చు. అటువంటి సమయాన చటుక్కున వెళ్ళడం సబబుకాదు.

ఈ ఆజ్ఞలు ఖుర్‌ఆన్‌లో ఇవ్వబడ్డాయి. ఇదే పరదా వ్యవస్థ. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) దాన్ని వివరిస్తూ, స్త్రీ యొక్క సతర్ (కప్పి ఉంచవలసిన భాగం) హద్దులు సూచించారు. ముఖం నుదుటి నుండి గడ్డం వరకు, ముంజేతులు మణికట్టు వరకు, పాదాలు మడమల వరకు తప్ప మిగిలిన శరీర భాగాన్ని సతర్ అంటారు. తండ్రీ, సోదరుల ఎదుట కూడా, "సతర్ హద్దులు" పాటించాలి. శరీరం వంపులు కనపడేలా, పలుచని బిగుతయిన

దుస్తులు ధరించ కూడదు. ఎదుటపడతగిన పురుషులు తప్ప ఇతర పురుషు లతో స్త్రీ ఒంటరిగా ఉండకూడదని శాసించారు. స్త్రీలు ఇంటి నుండి సువాసన ద్రవ్యాలు రాసుకుని బయటకు వెళ్లడాన్ని కూడా నిషేధించారు. మస్జిదులో చేసే సామూహిక నమాజ్‌లో కూడ ప్రవక్త (సఅసం) స్త్రీ పురుషులకు వేర్వేరు స్థలాలు ఏర్పాటు చేశారు. పురుషులు, స్త్రీలు సహ పంక్తిలో నమాజ్ చేయడాన్ని అనుమతించలేదు. నమాజ్ పూర్తయ్యాక ఆయన (సఅసం) ముందు మగవారు, తరువాత స్త్రీలందరూ వెళ్ళిపోయే వరకు కూర్చునే ఉండేవారు.

ఈ ఆజ్ఞలు పవిత్ర ఖుర్‌ఆన్‌లోని 'నూర్' సూరాలోనూ, అహ్‌జాబ్ సూరాలోను, ఇంకా ప్రామాణికమయిన హదీస్ (ప్రవక్త ప్రవచనాల) గ్రంథాల లోనూ ఎవరైనా చూసుకోవచ్చు. ఈనాడు మనం పరదా వ్యవస్థలో లేనిపోనివి ఎన్నయినా కల్పించుకుని ఉండవచ్చు. కాని నియమాలు నిబంధనలన్నీ స్పష్టంగానే ఉన్నాయి. నేను అల్లాహ్ మరియు ప్రవక్త (సఅసం) పేరు చెప్పి ఎవరి నోళ్ళూ మూయాలని అనుకోవడం లేదు. కాని ఈ మాటలు అనకుండా ఉండలేను కూడా. ఈనాడు మనలో చెలరేగిన "పరదా మన ప్రగతికి ప్రతిబంధకం" అనే భావం మనలో పేరుకుపోయిన ద్వంద్వ ప్రవృత్తికి బహిరంగ నిదర్శనం. ఈ భావం దైవం మరియు దైవప్రవక్త (సఅసం)పై అపనమ్మకాన్ని సూచిస్తోంది. దైవం మరియు ఆయన ప్రవక్త (సఅసం) మన అభివృద్ధి పథంలో పరదా మూలంగా అవరోధాలు సృష్టించా రనే కదా దీని అర్థం! ఒకవేళ నిజంగా మనం ఇలా భావిస్తున్నట్లయితే, మనం అనవసరంగా ముస్లిమ్‌లవడం దేనికి? మన మీద ఇలాంటి జులుం చేసిన ఆ దైవాన్ని, ప్రవక్త (సఅసం)ను ఎందుకు తిరస్కరించకూడదు? అలాకాక

అల్లాహ్ మరియు ప్రవక్త (సఅసం) అసలు పరదా ఆజ్ఞయే ఇవ్వలేదు అని పిడివాదం చేసినంత మాత్రాన ఈ ప్రశ్న నుండి తప్పించుకోలేం. నేను మొదటే చెప్పాను "పరదా" అనే వ్యవస్థకు సంబంధించిన సవివరమైన ఆజ్ఞలు కావలసిన వారు పవిత్ర ఖుర్‌ఆన్‌లోనూ, ప్రామాణికమైన హదీస్ గ్రంథాల లోనూ చూడవచ్చు. హదీసుపట్ల ఎవరికైనా ఆక్షేపణ ఏదైనా ఉంటే, ఖుర్‌ఆన్ లోని సవివరమైన ఆజ్ఞల్ని ఎక్కడ దాస్తారు?

"ఇస్లామ్" మనకు అందించే పరదా నియమాలు కాస్తయినా పరిశీలిస్తే దాని మూడుముఖ్యోద్దేశాలు ద్యోతకమౌతాయి. మొదటిది స్త్రీ, పురుషుల నైతికతను కాపాడాలి. సమాజంలో స్త్రీ, పురుషులు స్వేచ్ఛగా సంచరించడం వల్ల కలిగే అనర్థాల ద్వారం మూసివేయాలి. రెండవది స్త్రీలు సహజమైన స్వభావ సిద్ధమయిన విధులు సావకాశంగా, సులభంగా నిర్వర్తించేటట్లు పురుషులు తాము నిర్వర్తించవలసిన విధులు సలక్షణంగా నెరవేర్చేటట్లు స్త్రీల, పురుషుల ఆచరణా పరిధిని వేరు చేయాలి.

మూడవది, గృహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ పటిష్టవంతమూ, సురక్షితమూ చేయాలి. దీని ఆవశ్యకత జీవితంలోని మిగతా వ్యవస్థల కంటే కొంచెం ఎక్కువే కాని తక్కువకాదు.

పరదా విధానాన్ని కాదని, గృహ కుటుంబ వ్యవస్థల్ని సురక్షితంగా మలచినవారు స్త్రీని బానిసగా చేశారు, అన్ని హక్కుల నుండి దూరం చేశారు. స్త్రీకి ఆమె హక్కుల్ని ఇవ్వడంతో పాటు, పరదా నియమాలు ఏర్పరచకపోయిన చోటల్లా కుటుంబ వ్యవస్థ చెదిరిపోతుంది. ఇంకా రోజురోజుకు చెదిరి పోతూనే ఉంటుంది.

"ఇస్లామ్" స్త్రీకి ఆమె హక్కులన్నీ ప్రసాదించడంతోపాటు కుటుం‌ వ్యవస్థను కూడా భద్రపరచాలని కాంక్షిస్తుంది. అందువల్ల పరదా నియమా‌ స్త్రీ రక్షణకోసం అమలులో లేనంత వరకు ఈ లక్ష్యం సాధించడం సాధ్యపడదు

స్త్రీలు ఇస్లామ్ సూచించే ఈ లక్ష్యాలను గురించి సావధానంగ ఆలోచించాలని అభ్యర్థిస్తున్నాను. సౌశీల్యం నైతికతలను గురించి అంతగ పట్టించుకోని వారికి నేనేమీ చెప్పదలచుకోలేదు. కాని, దానికి ఏమయినా ప్రాముఖ్యత నిచ్చే వాళ్ళు ఆలోచించవలసిందేమంటే అలంకరణలు చేసుకొని విచ్చల విడిగా తిరుగుతూ, జీవితంలోని అన్ని విభాగాల్లో పురుషులతో సమంగా వారితో కలిసిమెలసి పనిచేస్తున్న సంకీర్ణ సమాజంలో స్త్రీలు నైతిక పతనం నుండి ఎలా ఎప్పటివరకు రక్షణ పొందగలరు? మన దేశంలో పరిస్థితులు ఎంతగా విషమిస్తున్నాయో మనం గమనించడం లేదా? సెక్సు నేరాలు పెరుగుతూనే పోతున్నాయి. ఈ వార్తలు నిత్యం వార్తాపత్రికలలో మనం చదువుతూనే ఉన్నాము. "ఈ పతనానికి అసలు కారణం స్త్రీ పురుషులు విచ్చలవిడిగా తిరగకపోవడమే, వారి మధ్య ఈ అడ్డుతెర(పరదా) లేకపోతే పురుషులు స్త్రీలంటే ముఖమ్మొత్తి పోయేవారు" అని వాదించే మహనీయులు చాలా మంది మనలో ఉన్నారు. ఇది సర్వాబద్ధం. ఎలాంటి అడ్డంకులు లేని చోట్లలోనే మనుషుల మనస్సుకు తృప్తికలగలేదు. వారి తీరని కోరికల సంతృప్తి కొరకే చివరికి దిగంబరత్వం వరకూ వ్యవహారం వెళ్ళింది. దిగంబరత్వం వల్ల కూడా తృప్తి కలక్కపోతే, స్త్రీ పురుషులు బజారుల వెంట బరితెగించి అశ్లీలంగా ప్రవర్తించే వరకూ వెళ్ళింది. అప్పటికి తృప్తి అనేది కామ పరితప్త హృదయాలకు ప్రాప్తం కాలేదు. ఇప్పటికి సెక్సు నేరాలు అధికం, అత్యధికం కాసాగాయి. వాటి రిపోర్టులు అమెరికా.

ఇంగ్లాండ్ ఇంకా ఇతర పాశ్చాత్య దేశాల పత్రికలలో వస్తూనే ఉన్నాయి. మనం చూస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితులు సంతృప్తికరమయినవా? ఇది కేవలం నైతిక సమస్యే కాదు, మన సంస్కృతికీ సమస్యే. సంకీర్ణ సమాజ భావం పరివ్యాప్తిచెందుతూ ఉంది. మహిళల దుస్తులకు, అలంకరణలకు, ఆభరణాలకు అయ్యే ఖర్చులు కూడా పెరిగిపోతున్నాయి. అందుకు ధర్మ బద్ధమయిన సంపాదన సరిపోదనేది జగద్విదితమే. పర్యవసానంగా ఎటు చూసినా లంచం, గల్లంతు, అవినీతి, అక్రమపద్ధతులు కూడా పెచ్చు పెరిగి పోతున్నాయి. ఈ అక్రమ పద్ధతులు మనదేశ భవిష్యత్తుకే గొడ్డలి పెట్టు. యే చట్టంపైనా సరిగా అమలు జరగటం లేదు. ఆలోచించవలసిందేమంటే, తమ కోరికల విషయంలో క్రమశిక్షణ అలవడని వారు, ఇతరుల విషయంలో నీతి నియమం పాటిస్తారా? తన గృహస్థ జీవితంలో విశ్వసనీయుడు కాలేని వ్యక్తి తన జాతి, దేశ వ్యవహారాల్లో విశ్వసనీయత ప్రదర్శించడం సాధ్యమా?

స్త్రీ, పురుషుల ఆచరణా పరిధి వేరుచేయడం సహజత్వానికి తార్కాణం. సహజంగానే, తల్లి అవడానికి కావలసిన లక్షణాలన్నీ స్త్రీ పరం చేయడంద్వారా, సృష్టి, స్త్రీయొక్క అసలు స్థానం ఏదో తెలియజేస్తోంది. తండ్రికి కావలసిన లక్షణాలు పురుషునికి ప్రసాదించడం ద్వారా, అతణ్ణి మాతృత్వపు బాధ్యతల నుండి ఏ పనుల నిమిత్తం తప్పించడం జరిగిందో కూడా సూచిస్తోంది. ఈ రెండు రకాల బాధ్యతలు నిర్వర్తించేందుకు స్త్రీ, పురుషుల శరీర నిర్మాణం కూడా భిన్నమయిన పంథాలో చెయ్యబడింది. వేర్వేరు శక్తులు, వేర్వేరు గుణాలు, వేర్వేరు మనస్తత్వాలు ఇవ్వబడ్డాయి. మాతృత్వం వహించే స్త్రీలకు ఓర్పు, నిగ్రహం, క్షమ ప్రసాదించింది సృష్టి. ఆమె స్వభావంలో మృదుత్వం, సౌకుమార్యం నిండి ఉన్నాయి. మమత ప్రేమానురాగాలకు ప్రతిరూపం స్త్రీ.

ఆమెకు ఆ లక్షణాలే లేకపోయినట్లయితే నేనూ, మీరూ క్షేమంగా ఇలా పెద్దవారం అయ్యేవాళ్ళం కాదు. ఈ బాధ్యతలు (పాపల పోషణ, సంరక్షణ) అప్పజెప్పబడిన వారికి పురుషులలోని కాఠిన్యం సరయిందికాదు. ఆ స్వభావం తల్లి కావడానికి అర్హతలేని వారికే తగినది. అలాగే మాతృత్వపు బాధ్యతలు వహించవలసిన వారికి ఇతర అన్ని రకాల బరువు బాధ్యతలనుండి రక్షించడం జరిగింది. మీరు ఈ విభజనను రద్దు చెయ్యదలచుకుంటే అలాగే నిర్ణయించుకోండి. ప్రపంచానికి తల్లుల అవసరం లేనట్లయితే, కొద్దికాలంలోనే మానవజాతి ఆటంబాంబు, హైడ్రోజన్ బాంబులతో నిమిత్తం లేకుండానే నశిస్తుంది. కాని మీరు ఆ నిర్ణయమూ తీసుకోక, ఈ విభజనను మార్చదలచుకుంటే స్త్రీ పట్ల అన్యాయం చేస్తున్నారన్నమాట. సృష్టి రీత్యా ఆమెపై బడిన మాతృత్వపు బరువుబాధ్యతలూ మోయాలి. (ఆ బాధ్యతల్లో పురుషుడు ఆమెతో ఏమాత్రమూ పాలుపంచుకోలేడు). పైగా ఆమె పురుషునితో పాటు రాజకీయాల్లో, వ్యాపారంలో, లలిత కళలలో, యుద్ధాలలో సమానంగా పాల్గొనాలా? కాస్త సావధానంగా ఆలోచించండి. మానవ సేవల్లో సగభాగ మయితే స్త్రీ ఒక్కతే మోస్తుంది. ఏ పురుషుడూ ఆ పనిలో కాస్తంతయినా ఆమె బరువును తగ్గించలేడు. మిగతా సగభాగంలో నుంచి మరోసగం కూడా స్త్రీయే మోయాలంటారు మీరు. అంటే ముప్పాతిక వంతు స్త్రీ బాధ్యతనూ, పాతిక వంతు మాత్రమే పురుషుని బాధ్యతా? ఇదేనా న్యాయం?

పాపం స్త్రీ ఈ దౌర్జన్యాన్ని సంతోషంగా సహించడానికి , పైగా పోరాడి తనపై లేనిపోని బాధ్యతలు వేసుకోడానికి కారణం మీరే. ఆమె స్త్రీగా స్త్రీ స్థానంలో పనిచేస్తూ ఉన్నంతవరకు మీరు గౌరవమివ్వడానికి నిరాకరించారు. మీరు పిల్లల తల్లిని హేళన చేశారు. గృహస్థ జీవితాన్ని అతి నీచంగా

చూచారు. ఆమె కుటుంబంలోచేసే సేవలకు ఏమాత్రం గుర్తింపు, విలువ ఇవ్వలేదు. మీ రాజకీయ ఆర్థిక సామాజిక కార్యకలాపాలు యుద్ధాల ఒడంబడికల కంటే గృహిణి నిర్వహించే బాధ్యతలు ఏ మాత్రం తీసిపోవు, ఏవిధంగానూ నిష్ప్రయోజనమైనవేమీ కావు. ఈ అబల పాపం సమాజంలో గుర్తింపు, గౌరవం, విలువ పొందడానికి పురుషులు చెయ్యవలసిన పనులన్నింటినీ చేసేందుకు ఒప్పుకుంది. ఎందుకంటే, పురుషుడు కాకపోయినా పురుష సంబంధమైన బాధ్యతలు, సేవలు నిర్వర్తించనిదే మీరు ఆమెను గౌరవించడానికి సిద్ధంగా లేరు. "ఇస్లాం" ఆమెపై కనికరం చూపింది. స్త్రీగా ఉంటూ, స్త్రీ సంబంధమైన బాధ్యతలే నిర్వహిస్తూ పురుషునితో సమాన గౌరవ మర్యాదల్ని, ఇంకా తల్లి స్థానంలో పురుషునికంటే అధిక గౌరవాదరణలనే ప్రసాదించింది.

పరదా "ప్రగతి" మార్గంలో అవరోధం అంటారు మీరు. మీరు కోరేదేమంటే స్త్రీ తల్లికావాలి, మేజిస్ట్రేట్ కూడా కావాలి. ఇంకా ఆడిపాడి పురుషుల మనస్సును రంజింప చెయ్యడానికి కూడా సమయం, తీరికా చేసుకోవాలి. ఆమె ఏ పనినీ పూర్తిగా, సవ్యంగా చేయలేనంత బరువు వేస్తున్నారు మీరు. ఆమె సృజన ఏ కార్యాలకయితే జరగలేదో ఆ పనులు మీరు ఆమె ద్వారా చేయిస్తున్నారు. ఆమె పురుషునితో పోటీపడలేని రంగంలోకి ఆమెను లాక్కొస్తున్నారు. ఆ రంగంలో పురుషుడు సహజంగానే ఆమెను అధిగమిస్తున్నాడు. ఎప్పుడయినా స్త్రీకి మెప్పు దొరికినా అది స్త్రీత్వం వల్ల లభించే మినహాయింపు ద్వారానే లభిస్తుంది. లేదా ఆమె నైపుణ్యానికి కాక అందచందాల ఆధారంగా మెప్పు లభిస్తుంది. ఇది మీకు 'ప్రగతి' కోసం చాలా చాలా అవసరం!

"ప్రగతి" అనే ఆవేశంలో ఇల్లూ, సంసారం యొక్క ఆవశ్యకతను మీరు మర్చిపోతున్నారు. ఇవి (ఇల్లూ సంసారం) మానవులు తయారయ్యే కార్ఖానాలు. ఈ కార్ఖానాల ఆవశ్యకత జోళ్ళు, పిస్తోళ్ళు తయారుచేసే వాటికి ఏ మాత్రం తీసిపోదు. ఈ కార్ఖానాలకు అవసరమైన గుణాలు , మనస్తత్వాలు, యోగ్యతలూ అందరికంటే అధికంగా స్త్రీకే ప్రసాదించింది సృష్టి. వీటిని నడపడానికి కావలసిన శ్రమ, ప్రయాసల అత్యధిక భారం స్త్రీల పైనేమోపింది. ఈ కార్ఖానాలలో చేయవలసిన పని చాలా ఉంది. ఎవరైనా బాధ్యతాయుతంగా చేయవలసిన విధంగా చేస్తే, ఆమెకు తల దువ్వుకునే తీరికి కూడా ఉండదు.

ఇంకా, ఈ కార్ఖానాలను ఎంత బాగా, సరైన రీతిలో ఎంత వివేకంగా నడిపితే అంతే ఉన్నత శ్రేణికి చెందిన మానవులు తయారు కాగలరు. ఇందుకు స్త్రీకి అత్యంత శ్రేష్ఠమైన విద్యా శిక్షణలు గరపడం అవసరం. ఈ కార్ఖానాలను శాంతంగా, సంతృప్తికరంగా, నమ్మకంగా నడపడానికి ఇస్లాం పరదా వ్యవస్థను ఏర్పరచింది. తద్వారా స్త్రీ ఇక్కడ పూర్తి ఏకాగ్రతతో, దృష్టి ఇతరత్రా పోనివ్వకుండా తన పని చేసుకోగలగాలి. పురుషులు కూడా పూర్తినమ్మకంగా ఈ జీవిత విభాగాన్ని ఆమె కైవసం చెయ్యగలగాలి. ఇక మీరు "ప్రగతి" కోసం ఈ క్రమశిక్షణని అతిక్రమించదలిచారు. ఇది అంత మయ్యాక రెండు పనులలో ఒకటి మీరు ఎలాగూ చెయ్యవలసి ఉంటుంది. పురాతన హిందూ నాగరికతనో లేదా ప్రాచీన క్రైస్తవ, యూదుల నాగరికతనో అవలంబించి స్త్రీని పూర్తిగా బానిసగా చేసేయండి. అప్పుడే కుటుంబ విధానం ఛిన్నాభిన్నం కాకుండా ఉంటుంది. లేదా మానవుడ్ని తయారుచేసే ఈ కార్ఖానాలు సర్వనాశనమై, జోళ్ళు, పిస్తోళ్ళు తయారయే కార్ఖానాలు మాౖతమే స్థిరపడి పోవడానికి అంగీకరించేందుకు సిద్ధంకండి

ఒక మాట సుస్పష్టం. ఇస్లాం ఏ శాసనపరమైన, ఆర్థికపరమైన హక్కుల్ని స్త్రీకి ఇస్తుందో వాటిపై అమలు జరుపుతూ ఇస్లాం స్థాపించిన ఈ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే, కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం అవకుండా ఉంటుందనడానికి ఏ మాత్రం అవకాశం లేదు. కాబట్టి ప్రగతికి కొలమానం మీ వద్ద ఏది ఉన్నా దాన్ని దృష్టిలో పెట్టుకుని, మీరు పొందదలచింది యేమిటో, పోగొట్టుకోదలచిందేమిటో ఆలోచించండి.

"ప్రగతి" అన్నది చాలా విస్తృతార్థంగల పదం. దానికి ఏ ఒక్క నిర్ణీత మైన భావం అంటూ లేదు. ముస్లిమ్‌లు ఒకప్పుడు బంగాళాఖాతం నుండి అట్లాంటిక్ మహాసముద్రం వరకు రాజ్యమేలారు. సైన్సు, ఫిలాసఫీలలో వారు ప్రపంచానికి గురువులు. సంస్కృతి, నాగరికతలలో మరే జాతి -వారితో సరితూగలేదు. ప్రపంచంలోని ఏ నిఘంటువులో నైనా దానికి ప్రగతి అన్న భావం లభిస్తుందో లేదో తెలీదు! ఒకవేళ అది ప్రగతే అయితే ఆ ప్రగతిని సాధించింది పరదా వ్యవస్థను పాటించిన సమాజమే అని మనవి చేస్తున్నాను!

ఇస్లామీయ చరిత్రలో గొప్ప గొప్ప దైవజ్ఞులు, పండితులు, విద్వాంసులు, తత్వవేత్తలు, రాజ్యాధినేతలు, రచయితలు, విజేతలు అనేక మంది ఉదయించారు. ఈ మహనీయులు అజ్ఞానులైన తల్లుల ఒడులలో పెరిగి పెద్దవారై ఉండరు కదా? ఇంకా మహిళల్లో కూడా గొప్ప గొప్ప విద్వాంసులు, ధర్మ వేత్తలయిన మహిళల పేర్లు మనకు ఇస్లామీయ చరిత్రలో లభిస్తాయి. వారు విద్యా వ్యాసంగాలలో, కళలలో, సాహిత్యంలో సిద్ధహస్తులు. పరదా వ్యవస్థ ముస్లిముల ఈ ప్రగతికి ప్రతిబంధకం ఏ మాత్రం కాలేకపోయింది. ఈనాడు కూడా అటువంటి ప్రగతినే మనం కాంక్షిస్తున్నట్లయితే దాన్నుండి పరదా

మనల్ని దూరం చెయ్యదు. ఒకవేళ ఎవరి దృష్టిలోనైనా ప్రగతి అంటే పాశ్చాత్యులు సాధించినదే అయితే, నిస్సందేహంగా ఆ విషయంలో పరదా ప్రగతికి చెడ్డ ఆటంకం. పాశ్చాత్యులు ఆ ప్రగతిని సాధించేందుకు నైతికతను, కుటుంబ వ్యవస్థను ప్రమాదంలో పడేసి మరీ సాధించారు. వాళ్ళు స్త్రీని ఆమె యొక్క ఆచరణా పరిధిని అతిక్రమింపజేసి పురుషుని ఆచరణా పరిధిలో ప్రవేశపెట్టారు.

ఈ విధంగా వాళ్ళు ఆఫీసులు, కార్ఖానాలు నడిపేందుకు రెట్టింపు చేతులయితే సంపాదించారు. బయటికి ఎంతో ప్రగతిని కూడా సాధించారు. కాని గృహస్థ శాంతిని మాత్రం కోల్పోయారు. ఈనాటికి అక్కడ కాపురాలు నిలిచి ఉన్నాయంటే గృహిణులయిన స్త్రీల వల్లనే అవి స్థిరంగా ఉండగలిగాయి. పురుషులతో పనిచేసే స్త్రీలు ఎక్కడా గృహస్థ వ్యవహారాలు చక్కబెట్టుకోవడం లేదు. చక్కబెట్టుకోలేరు కూడా. వారి వివాహాలు విడాకులతో అంతమవు తున్నాయి. వారి పిల్లల భవిష్యత్తు నాశనమవుతుంది. వారి నివాసం ఏదైనా ఉందంటే క్లబ్బుల్లోనూ, హోటళ్ళలోనే. గృహం వారికి శాంతినిచ్చే స్వర్గధామం కాదు. తమ వారసులు కాగల ఉత్తమ మానవులను తయారుచేసే పనిని వారు మానుకున్నారు. ఇలాంటి "ప్రగతి" యొక్క ప్రేమ వలలో పడటానికి ఇష్టపడేవారిని మనము యేమనగలం?

-: సమాప్తం :-